క్లుప్తంగా

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

చండ్రుగొండ: ఉమ్మడి రాష్ట్రంలోని దైవదర్శనాలకు రవాణా సౌకర్యం కల్పిస్తూ కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. చండ్రుగొండలోని బస్టాండ్‌ను గురువారం సందర్శించిన ఆయన.. విలేకరులతో మాట్లాడారు. వేములవాడ, కొండగట్టు, వేయిస్థంబాలగుడి, భద్రాచలంలోలని సీతారామచంద్రస్వామి ఆలయం, విజయవాడలోని అమరావతి, పెనుగొండ, బాడపల్లి, ద్రాక్షరామ, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, తదితర దర్శనీయ ఆలయాలకు డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. 30 మంది ఉంటే కోరిన ప్రాంతానికి బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తామన్నారు. అవసరం ఉన్నవారు 7382858008 సెల్ నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు. డిపో మేనేజర్ వెంట వీబీట ఇసనపల్లి శ్యామ్యులు పాల్గొన్నారు.

ఎంఈఓకు అభినందన



దమ్మపేట ఎంఈఓను సన్మానిస్తున్న ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ

దమ్మపేట: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి పది ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకుగాను.. దమ్మపేట ఎంఈఓ కీసర లక్ష్మిని, ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా అభినందించారు. గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో నాలుగు జిల్లాలకు చెందిన డీఈఓలతో జరిగిన రివ్యూ సమావేశంలో.. ఎంఈఓను యోగితా రాణా శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

ఏఐటీయూసీతో స్ట్రక్చర్ సమావేశం

మణుగూరుటౌన్: ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం అధికారులు ఏఐటీయూసీ యూనియన్ ప్రతినిధులతో 4వ స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ గమ్‌షూస్, డ్రైవర్ షూస్ అందించడం, యూనిట్ స్థాయి సమస్యలను సత్వరగా పరిష్కరించడంతో పాటు గనులు కేసీహెచ్‌పీల్లో సూపర్‌వైజర్ల కొరత, మైనర్స్ క్యాంప్ లైట్ చార్జర్ ర్యాక్ సమస్య, పీకేఓసీలో సౌకర్యాల లేమి, మ్యాన్‌వేల కోసం నియమిత క్లరికల్ నియామకం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ.. యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య సమన్వయం ఉత్పత్తికి సహకరిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసచారి, లక్ష్మీపతిగౌడ్, చంద్రశేఖర్, సీతా రాంబాబు, రమేశ్, జ్యోతిర్మయి, మదన్‌నాయక్, శివ ప్రసాద్, మధుబాబు, మధుసూదన్, శ్రీనివాస్, ప్రవీణ్, ఏఐటీయూసీ నాయకులు మేకల ఈశ్వర్, పుల్లారావు తదితరులు ఉన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు



ఆర్‌ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి లక్ష్మీసాహితి

బూర్గంపాడు: ఆర్‌ఎంపీ వైద్యులు తమ స్థాయిని మించి వైద్యం చేయవద్దని మోరంపల్లిబంజర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మిసాహితి సూచించారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో గురువారం మండలంలోని ఆర్‌ఎంపీ వైద్యులు, ల్యాబ్ టెక్నిషియన్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీ వైద్యులు తమ వద్ద వచ్చిన రోగుల ఆర్యోగ పరిస్థితులకు అనుగుణంగా ప్రాథమిక చికిత్సలు మాత్రమే నిర్వహించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు జీతు, రమణ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: సమితిసింగారం గ్రామ పంచాయతీ సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. భక్తులు అన్నదానం చేశారు. ముప్పారపు రాణి, వారి కుమారుడు విద్యాసాగర్–నిశిత దంపతులు, అభయ్‌రామ్, విజయ్‌కుమార్–సుస్మిత దంపతులు.. దివంగత ముప్పారపు నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాతలను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా!

- ప్రభుత్వ పాఠశాలల్లో సికిల్ సెల్ పరీక్షలు
- ప్రాథమిక దశలోనే వ్యాధి నిర్ధారణకు ప్రభుత్వం చర్యలు
- గిరిజన, గ్రామీణ ప్రాంత విద్యార్థులపై ప్రత్యేక దృష్టి




విద్యార్థులను పరీక్షిస్తున్న కరకగూడెం వైద్యాధికారి రవితేజ

కరకగూడెం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. పాఠశాలల్లో 'సికిల్ సెల్–అనీమియా'పరీక్షలను నిర్వహిస్తోంది. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా విద్యార్థులలో ప్రాథమిక దశలోనే ఈ వ్యాధిని గుర్తించి, సకాలంలో చికిత్స అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇది విద్యార్థులకు ఆరోగ్య భరోసాను కల్పించడమే కాకుండా భవిష్యత్తులో వ్యాధి వ్యాప్తిని నియంత్రించడంలో సహాయపడుతుంది. వైద్య నిపుణులు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసిస్తున్నారు.

రక్త సంబంధిత వ్యాధి..

సికిల్ సెల్ అనీమియా అనేది ఒక వంశపారంపర్య రక్త సంబంధిత వ్యాధి. ఈ వ్యాధి ఉన్న వారిలో ఎర్ర రక్త కణాలు సాధారణ గుండ్రటి ఆకారంలో కాకుండా, కొడవలి ఆకారంలో మారిపోతాయి. ఈ కొడవలి ఆకారపు కణాలు రక్తనాళాల్లో అడ్డుపడి, తీవ్రమైన నొప్పి, అవయవ నష్టం, రక్తహీనత వంటి సమస్యలకు దారితీస్తాయి. కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా కొన్ని గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యాధి ప్రబలంగా ఉంది. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం వల్ల దాని తీవ్రతను తగ్గించవచ్చు. సరైన చికిత్స, నిర్వహణ ద్వారా రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచవచ్చు.



సికిల్ సెల్.. రెడ్ బ్లడ్ సెల్ మధ్య తేడా ఇది..

ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు

తెలంగాణ ప్రభుత్వం ఈ వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సికిల్ సెల్ పరీక్షలు నిర్వహిస్తోంది.ఆయా పాఠశాలల పరిధిలోని ప్రభుత్వ వైద్య బృందాలు పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల నుండి రక్త నమూనాలను సేకరించి, పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఈ పరీక్షలు సాధారణంగా వేలి నుండి చిన్న రక్తపు చుక్కను సేకరించి చేసే వేగవంతమైన పద్ధతిలో జరుగుతాయి.

పరీక్షల ప్రయోజనాలు..

1. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం వల్ల సకాలంలో చికిత్స ప్రారంభించవచ్చు.
2. నిర్ధారణ అయిన విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా చికిత్స, మందులు అందుబాటులోకి వస్తాయి.
3. ఈ పరీక్షల ద్వారా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన పెరుగుతుంది.
4. వ్యాధి ఉన్నవారికి ఉన్నవారికి భవిష్యత్తులో సంతానం విషయంలో తగిన కౌన్సిలింగ్ అందించడానికి ఇది తోడ్పడుతుంది.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి..



సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించడం వల్ల మా పాఠశాలలోని విద్యార్థుల్లో ఎవరికైనా ఈ సమస్య ఉంటే ముందుగానే తెలుస్తుంది. దీనివల్ల మేము వారి పట్ల మరింత శ్రద్ధ వహించగలం. అవసరమైన సహాయాన్ని అందించగలం. ఈ కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో కూడా ఆరోగ్యంపై అవగాహనను పెంచుతోంది. ఇది విద్యారంగానికి, సమాజానికి చాలా మంచిది. విద్యార్థుల ఆరోగ్యం చాలా ముఖ్యం. వారు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారించగలరు.

– మోహన్‌బాబు, హెచ్‌ఎం, భట్టుపల్లి జెడ్పీ పాఠశాల

ఆరోగ్యకరమైన భవిష్యత్‌కు భరోసా..



సికిల్ సెల్ అనీమియా అనేది ఒక తీవ్రమైన రక్త సంబంధిత వ్యాధి. దీనిని చిన్నతనంలోనే గుర్తించకపోతే పిల్లల ఎదుగుదలపై వారి మొత్తం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ పరీక్షల ద్వారా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స, కౌన్సెలింగ్ అందించడం వల్ల వారి జీవిత నాణ్యతను గణనీయంగా మెరుగుపరచవచ్చు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం నిజంగా ప్రశంసనీయం. ఇది భవిష్యత్తులో ఈ వ్యాధి వ్యాప్తిని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

– రవితేజ, వైద్యాధికారి, కరకగూడెం పీహెచ్‌సీ

మహిళల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని టీజీఆర్టీసీ మణుగూరు డిపో ఆవరణలో మహాలక్ష్మి పథకంలో 200కోట్ల మహిళ ఉచిత ప్రయాణాలు చేసిన సందర్భంగా గురువారం సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంతో టీజీఆర్టీసీ లాభాల్లో పయనిస్తోందన్నారు. మహిళల 200కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలతో ఆర్టీసీ సంస్థ రూ.6680కోట్లను ఆర్జించిందన్నారు. ఆర్టీసీలో ఆక్యూపెన్సీ రేటు 62నుండి 97కు చేరిందన్నారు. గతంలో ఆర్టీసీ ద్వారా 45లక్షల మంది ప్రయాణిస్తే.. ప్రస్తుతం 65లక్షల మంది ప్రయాణిస్తున్నారన్నారు. ఉచిత బస్ ప్రయాణం పథకం ద్వారా ప్రభుత్వం చెల్లించిన ఆదాయంతో ఆర్టీసి సంస్థ కొత్తబస్సులను కొనుగోలు చేసిందని వెల్లడించారు. ఆర్టీసికి పెండింగ్ బకాయిలను కూడా చెల్లిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఆర్టీసీ డీఎం శ్యాంసుందర్, డీడబ్ల్యూఓ లెనినా, సీడీపీఓ జయలక్ష్మి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు పీరినాకి నవీన్, శివసైదులు, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు సౌజన్య, యూత్ మండల అధ్యక్షుడు సతీష్, నీలకంఠేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కూచిపూడిబాబు, నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

దుమ్ముగూడెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ బీజేపీ కార్యకర్తా పని చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి సతీష్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కుంజాధర్మలు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పెద్ద ఆర్లగూడెంలో బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కార్యచరణపై సమావేశాన్ని మండల అధ్యక్షుడు కంద్రపు త్రినాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రధాని మోదీ పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలు, నిధులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు రాంబాబు, అంజి రెడ్డి, పవన్ కుమార్, రుక్మిణి కుమారి, కృష్ణారెడ్డి, హిమంత్, సాయి, వీర్రాజురెడ్డి, బాలు, శ్రీను పాల్గొన్నారు.

3న ఏఐవైహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ములకలపల్లి: ఎరుకల హక్కుల పోరాట సమితి (ఏఐవైహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలిండియా ఎరుకల ఎంప్లాయిస్ నేషనల్ కో–కన్వీనర్ గరికె శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ములకలపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన సంఘ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐవైహెచ్‌పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆగష్టు 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జగన్నాథం నారాయణ, ప్రధాన కార్యదర్శిగా మొగిలి ప్రకాష్, కోశాధికారిగా పొన్న వెంకటేశ్వర్లుతోపాటు పలువురితో నూతన మండల కమిటీని ప్రకటించారు.

పునర్వసు కల్యాణం



తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో స్వామి వారి జన్మనక్షత్రం పునర్వసు నక్షత్రం సందర్భంగా గురువారం కల్యాణం ఘనంగా నిర్వహించారు. విశేష అభిషేకం, విభిన్న పూజలతో అర్చకులు సాంప్రదాయ బద్ధంగా కల్యాణం నిర్వహించారు. తిలకించిన భక్తులు స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో భద్రాచల ఉపప్రధాన అర్చకుడు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, కోటి విష్ణువర్ధనాచార్యులు ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఆలయ ముఖ్య అర్చకులు మదన మోహనాచార్యులు, వెంకటాచార్యులు, నరసింహాచార్యులు, వేదపండితులు మల్లారి రవికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణం వర్ధంతి



నాగభూషణం స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

దుమ్ముగూడెం: సీపీఐ సీనియర్ నాయకుడు రావులపల్లి నాగభూషణం 11 వర్ధంతి కార్యక్రమాన్ని సర్పాపురం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఆయన స్తూపం వద్ద పార్టీ సీనియర్ నాయకుడు మందపాటి సుధాకర్ రెడ్డి జెండా ఎగుర వేసి పూలమాలలతో నివాళ్లు అర్పించారు. నాగభూషణం కుమారుడు రావులపల్లి రవి కుమార్ మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడిని యోధుడు రావులపల్లి నాగభూషణం ఆశయాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బొల్లోజు వేణు, సహాయ కార్యదర్సులు తాటి పూడి రమేష్, కాకా వెంకటేశ్వరరావు, నాయకులు చప్పిడి రామచంద్రరావు, బొనగాల లింగయ్య, రాచకొండ సురేష్ చంచల కృష్ణ, కుర్సం ప్రసాద్, డేగల వినోద్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి



భద్రాచలంటౌన్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. మూడు దశల పోరాట కార్యక్రమాల్లో భాగంగా గురువారం వినతులు అందించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, కామన్ సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించడం, జిల్లా విద్యాశాఖ అధికారి, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, మండల విద్యాధికారి, డైట్, బీఈడీ కళాశాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను బదిలీలు, పదోన్నతుల ద్వారా భర్తీ చేయడం, అన్ని రకాల పెండింగ్ బిల్లులతో పాటు రిటైర్డ్ అయిన, చనిపోయిన ఉపాధ్యాయుల పెన్షనరీ బెనిఫిట్స్ విడుదల చేయడం, డీఏలు తదితర డిమాండ్లతో ఈ కార్యక్రమాలు చేపట్టారు.

భద్రాచలంటౌన్: టీఎస్ యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎం.రామాచారిలు భద్రాచలం తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బి.ప్రకాష్ రావు, టీఎస్ యుటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, మండల కార్యదర్శులు కరుణకుమార్, సైదులు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: యూఎస్పీసీ నాయకుడు బుటారి రాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ భాస్కర్, మండల ఉపాధ్యక్షులు సత్యమ్మ, సభ్యులు ఎల్.రవి ప్రసాద్, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఏ.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, సభ్యులు జె.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండాల: యూఎస్పీసీ నాయకులు జోగా రాంబాబు, ఇస్లావత్ హాథిరామ్, బాలస్వామి ఆధ్వర్యంలో గుండాల, ఆళ్లపల్లి మండల కేంద్రాల్లో వేరువేరుగా తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందించారు. నాయకులు అగ్గి రామకృష్ణ భోజ్య సురేష్ నాగేశ్వరరావు రామయ్య భావసింగ్ తులసి రామ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా మారుస్తాం..



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రంలోనే అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, మోడల్ నియోజకవర్గంగా మారుస్తానని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. గురువారం మండలంలోని పాత రెడ్డిగూడెం, తోగూడెం, తిరుమలకుంట, ఊసిర్లగూడెం, కుడుములపాడు, నందిపాడు, నారాయణపురం, గాండ్లగూడెం, కన్నాయిగూడెం, కేశప్పగూడెం, ఊట్లపల్లి, నారంవారిగూడెం కాలనీతోపాటు అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని దొంతికుంట, పేరాయిగూడెంలో విస్తృతంగా పర్యటించి ఆయా గ్రామాల్లో రూ.2కోట్ల 90లక్షల వ్యయంతో చేపట్టిన 11 సీసీ రోడ్లతోపాటు జీపీ భవనాలు, అదనపు తరగతి గదులు, ప్రహారి గోడల నిర్మాణాలను ప్రారంభించారు. అదే విధంగా డబుల్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులచేత గృహ ప్రవేశాలు చేయించారు. కాగా, ఆయా గ్రామాల్లో స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రానికి మోడల్‌గా మారుస్తానని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, రోడ్లపై వరదనీరు నిల్వ లేకుండా చూడాలని మున్సిపాలిటీ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ నాగరాజు, పీఆర్ డీఈఈ శ్రీధర్, ఏఈఈ అక్షిత, ఐటీడీఏ ఏఈఈ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, జ్యేష్ఠ సత్యనారాయణ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న అతిథి ఆధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులని తెలిపారు. సెరికల్చర్, వృక్షశాస్త్రం, జీవశాస్త్రం, రాజనీతి శాస్త్రం, ఆర్థికశాస్త్రం, చరిత్ర, తెలుగులో ఒక్కో పోస్టు.. కామర్స్‌లో 3, ఇంగ్లీష్ 2, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 3 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు ఫారంలను భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆఫీస్‌లో ఈ నెల 26 వరకు అందించాలని, దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకోవటం జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ మార్కుల జాబిత, టీచింగ్ అనుభవం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జతచేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్–సైన్స్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

మణుగూరులో..

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డి.భద్రయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రెండు ఇంగ్లీష్.. తెలుగు, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రంలు ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని అతిథి అధ్యాపకులతో నియమించేందుకు అర్హత గలవారి నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకైతే 50శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, నీట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బోధన అనుభవం ఉన్న వారు సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించాలని తెలిపారు. ఈ నెల 28వ తేదీన భద్రాద్రి కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్హత గల అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని, అభ్యర్థుల తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

డైవర్షన్‌పై గోతులు.. నిలిచిన ట్రాఫిక్



తూరుబాక డైవర్షన్ రోడ్డు వద్ద బారులుదీరిన వాహనాలు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక దగ్గర ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి గురువారం రాత్రి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఓ పక్క ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండగా.. ఆ డైవర్షన్ రోడ్డు మీద నుంచే వందల కొద్ది ఇసుక లారీలు వెళ్లాయి. దీంతో గోతులు ఏర్పడి సామాన్య ప్రజలు ప్రయాణించే వీలు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో వర్షం పడుతుండటంతో డైవర్షన్ రోడ్డు అంతా చిత్తడిగా మారింది. దీంతో గురువారం వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడి ట్రాఫిక్ జామ్ అయింది. మండల వాసులతోపాటు చర్ల నుంచి అత్యవసర సమయంలో వెళ్లే వాహనాలు, అంబులెన్స్‌లు భద్రాచలం వెళ్లాలంటే ఇదే రహదారి దిక్కు. అధికారులు దీనిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే డైవర్షన్ రోడ్డుపై మరమ్మతులు చేపట్టి వాహనాలు వెళ్లేలా చూడాలని, ఇసుక లారీలను నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అమరవీరుల స్మారక జ్యోతి ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీఐ నాయకులు

మణుగూరుటౌన్: సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా మణుగూరు నుంచి అమరవీరుల స్మారక జ్యోతి ర్యాలీని పార్టీ నాయకులు గురువారం ప్రారంభించారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డిపుల్లారెడ్డి స్మారకజ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఇది అశ్వారావుపేట వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరీశ్, నాయకులు పాల్గొన్నారు.

తుమ్మలచెరువుకు 14 అడుగుల నీరు

అశ్వాపురం: మండలంలో ప్రధాన సాగునీటి వనరైన కాకతీయులకాలం నాటి తుమ్మలచెరువు నీరు గురువారం 14 అడుగుల నీటిమట్టానికి చేరింది. ఖరీఫ్‌లో ఆయకట్టు కింద 10వేల ఎకరాలలో వరిసాగుకు రైతులు సిద్ధం కాగా.. చెరువులో 11 అడుగుల నీరు మాత్రమే ఉండడం, వర్షాలు లేకపోవడంతో ఇప్పటివరకు వరినార్లు ఎండిపోతూ వచ్చాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులో మూడు అడుగుల నీరు చేరి నీటిమట్టం 14 అడుగులకు చేరింది. మరో రెండు అడుగుల నీరు చేరితే ఆయకట్టు కింద ఖరీఫ్‌కు సాగునీరు ఢోకా లేనట్టే.

వరద నీటి మళ్లింపునకు చర్యలు



ఖాళీ స్థలాల్లోని నీటిని మళ్లిస్తున్న దృశ్యం..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని పలు వీధుల్లో వరద నీరు భారీగా ప్రవేశించిన నేపథ్యంలో కమిషనర్ ప్రసాద్ ఖాళీ ప్రదేశాల్లో నిలిచిన నీటిని కాల్వలకు మళ్లింపు చర్యలు చేపట్టారు. గురువారం శ్రీశ్రీనగర్, సుందరయ్యనగర్ ప్రధాన వీధిలో సైడ్ కాల్వల్లోని నిలిచిన మురుగును తొలగించారు. జేసీబీని ఏర్పాటు చేసి వినాయకనగర్, ప్రైవేట్ పాఠశాల వెనుక ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగించి, నిలిచిన నీటిని మళ్లించారు. పనులను పర్యవేక్షించేందుకు సిబ్బందిని కేటాయించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ బాధ్యుల నేతృత్వంలో కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచారు. ఆస్పత్రులు, వృద్ధాశ్రమాల్లో పాలు, పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. పారిశ్రామిక రంగంలో కేసీఆర్ కృషిని కొనియాడారు. కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



బూర్గంపాడు: ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



భద్రాచలంటౌన్: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు